క్లుప్తంగా

ఆహ్వానం



నర్సంపేట : గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) వరంగల్, హన్మకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) ఖిలా వరంగల్‌లో తలపెట్టిన కార్తీక వనభోజనాలకు రావాలని కోరుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్, నాయకుడు సుధాకర్‌గౌడ్ శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. గౌడ కుల గురువైన కంఠ మహేశ్వరుడు, రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మ దేవతలకు కార్తీక మాస మహోత్సవం సందర్భంగా గౌడ కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్వర్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం తదితరులు హాజరౌతారని చెప్పారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



రాయపర్తి : ఈనెల 7 నుంచి గోవాలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్ విద్యార్థిని ఎం.హరిప్రియ ప్రతిభ చాటి బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. స్కూల్‌లో హరిప్రియను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

పోస్టాఫీస్‌లో విద్యార్థుల అధ్యయనం

నర్సంపేట : పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, అక్షర ద స్కూల్ నాల్గో తరగతి విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా పట్టణంలోని పోస్టాఫీస్‌ను శనివారం సందర్శించి అధ్యయనం చేశారు. పోస్టల్ ఉద్యోగుల విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడారు. పోస్టల్ శాఖ సేవలను వివరించారు. విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ భవాని, సబ్ పోస్ట్‌మాస్టర్ సురేశ్, పోస్టల్ అసిస్టెంట్ రాజన్, తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం సదరం క్యాంపు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి ఆధ్వర్యంలో 40 మంది దివ్యాంగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ నర్సింహస్వామి మాట్లాడారు. ఆర్థో/లోకోమోటర్ విభాగానికి చెందిన 60 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 40 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. అర్హులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి విరీన్, ఫిజియోథెరపిస్ట్ నర్సింహారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక పాలన'

నర్సంపేట : రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు కొత్తకొండ రాజమౌళి విమర్శించారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహజ్యోతి, రైతుబంధు, రైతు రుణమాఫీ లాంటి ఏ ఒక్క పథకం కూడా అమలుకు నోచుకోలేదని తెలిపారు. రైతుల భూములను లాక్కునే చర్యలకు దిగుతున్న ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పారు.

బస్సులో మర్చిపోయిన మొబైల్ అప్పగింత

నర్సంపేట : స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఉప్పల్ నుంచి హన్మకొండకు వచ్చే క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రయాణికుడు నగేశ్ రూ.32 వేల విలువైన మొబైల్ మర్చిపోగా గమనించిన డ్రైవర్ హరిసింగ్ డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ఆదేశాల మేరకు హన్మకొండ బస్టాండ్ స్టేషన్ మేనేజర్ ఆధ్వర్యంలో బాధితుడికి శనివారం అప్పగించాడు. కార్యక్రమంలో కండక్టర్ హేమలత, కంట్రోలర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాసభ

నర్సంపేట : పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో నేడు (ఆదివారం) మానవ హక్కుల వేదిక 10వ మహాసభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి దిలీప్ తెలిపారు. పట్టణంలో శనివారం వారు మాట్లాడారు. నల్లబెల్లి మండలంలోని రంగయ్య చెరువును రిజర్వాయర్‌గా మార్చడం వల్ల ముంపునకు గురయ్యే రైతుల, ప్రజల సమస్యలపై వక్తలు ప్రసంగిస్తారని చెప్పారు. గిరిజన, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు, రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాలుబంధం కాల్వకు మోక్షమెప్పుడో?

- పేరుకుపోతున్న నాచు, పిచ్చిమొక్కలు
- శుభ్రం చేసినా చివరి ఆయకట్టుకు నీరందని దుస్థితి



కాల్వలో పిచ్చిమొక్కలు, నాచు

నర్సంపేట రూరల్ : జాలుబంధం కాల్వకు మోక్షం ఎప్పుడో?. అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో నీరు వృథా పోవడంతోపాటు పిచ్చిమొక్కలు, నాచు ఏపుగా పెరిగి నీరు సాఫీ వెళ్లే పరిస్థితి లేదు. ప్రతి పంటకూ కాల్వలను శుభ్రం చేసినా చివరి ఆయకట్టుకు నీరు అందని దుస్థితి నెలకొంది. దీంతో రైతులు సీజన్‌కు రెండు సార్లు కాల్వలను శుభ్రం చేయించుకోవాల్సి వస్తోంది. కాల్వలకు శాశ్వత ప్రాతిపదికన లైనింగ్ పనులు చేపడితేనే సమస్య పరిష్కారమవుతుందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

పాకాల చెరువు నుంచి జాలుబంధం కాల్వ ద్వారా నర్సంపేట మండలంలోని రాజుపేట శివారులోని చింతగడ్డతండాకు, పట్టణంలోని సర్వాపురం, ద్వారకపేట గ్రామాల్లోని వ్యవసాయ భూములకు నీరందుతుంది. ఈ కాల్వ నిడివి సుమారు 10–15 కిలోమీటర్ల మేర ఉంటుంది. కాల్వ కింది దాదాపు 5 వేల ఎకరాల వరకు సాగు అవుతోంది. అనధికారికంగా మరో 1500 ఎకరాల మేర సాగవుతున్నట్లు తెలుస్తోంది. అయినా కాల్వలకు శాశ్వత లైనింగ్ పనులు చేయకపోవడంతో ప్రతి ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో కాల్వలు శుభ్రం చేసినా 15 రోజులకే మళ్లీ నాచు, పిచ్చిమొక్కలు పెరిగి కాల్వ కట్టలు సైతం తెగిపోతున్నాయి. రైతులు తాత్కాలికంగా కట్ట వేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇక వర్షాకాలంలో వరద ఉధృతంగా ఉంటే మళ్లీ కట్ట కొట్టుకపోయే ప్రమాదం ఉంది. లైనింగ్ లేకపోవడంతో కాల్వకు గండి పడి నీరంతా వృథాపోతూ చివరి ఆయకట్టుకు నీరందకపోవడం పరిపాటిగా మారింది. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కాల్వలకు లైనింగ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కాల్వలు శుభ్రం చేసినా..



ఏటా స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రైతులు జాలుబంధం కాల్వను శుభ్రం చేసినా మళ్లీ 15 రోజుల్లోనే మొక్కలు పెరిగి నీరు చివరి ఆయకట్టు అందడం లేదు. కాల్వలు సరిగా లేకపోవడంతో గండి పడి నీరంతా వృథా పోతోంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే కాల్వలకు లైనింగ్ పనులు చేయించాలి.

-బొట్ల రాజు, రైతు

ఏటా నీటి కోసం తిప్పలు



ప్రతి ఖరీఫ్, రబీ సీజన్‌లో నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. ఒక్కోసారి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాల్వలు శుభ్రం చేస్తారు. శుభ్రం చేయని పక్షంలో ఆయకట్టు రైతులు చందాలు వేసుకోని శుభ్రం చేయిస్తాం. జాలుబంధం కాల్వ బ్రిడ్జి అనేక ఏళ్ల క్రితం నిర్మించిన క్రమంలో శిథిలమైంది. కొత్తగా బ్రిడ్జి నిర్మించాలి.

-లక్ష్మయ్య, కౌలు రైతు

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం

జాలుబంధం కాల్వల లైనింగ్ పనులకు సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాము. ఇటీవల కురిసిన వర్షాలకు కాల్వకు ఒకటి, రెండు చోట్ల గుండ్ల పడడంతో వెంటనే పూడ్చాం. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రతిపాదనలను మంజూరు చేయగానే శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడతాం.

-స్నేహలత, ఏఈ

దిగజారిన పోలీస్ వ్యవస్థ

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శనివారం జరిగిన బీఆర్‌ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పోలీసుల చర్యలు హద్దులు మీరాయని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్న పోలీసులకు దీటుగా మండల కమిటీలు పనిచేయాలని కోరారు. హైకోర్టు, ఎస్సీ, ఎస్టీ కమిషన్లతో పాటు హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేయడానికి బీఆర్‌ఎస్ లీగల్ సెల్ అడ్వకేట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈనెల 25న లగచర్ల బాధితులకు అండగా మహబూబాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహిస్తున్న సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. త్వరలో కేసీఆర్ సమక్షంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశ ఉంటుందని పేర్కొన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నాగెల్లి వెంకటనారాయణ, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, నామాల సత్యనారాయణ, చెట్టుపల్లి మురళీధర్, బానోతు సారంగపాణి, వేములపల్లి ప్రకాశ్‌రావు, బాల్నె వెంకన్న, బత్తిని శ్రీనివాస్, గోనె యువరాజు, బండి రమేశ్, కొమ్ము రమేశ్‌యాదవ్, కక్కెర్ల శ్రీనివాస్, ఊడుగుల ప్రవీణ్ పాల్గొన్నారు.



దుగ్గొండి: బాలలతో మాట్లాడుతున్న సంగీతలక్ష్మి



సంగెం : అంగన్‌వాడీ కేంద్రంలో..

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



నెక్కొండ : కేజీబీవీలో..



పర్వతగిరిలో..



ఖానాపురంలో..



నల్లబెల్లిలో..

సాక్షి నెట్‌వర్క్ : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు జిల్లాలోని దుగ్గొండి, సంగెం, నెక్కొండ, పర్వతగిరి, ఖానాపురం, నల్లబెల్లి, తదితర మండలాల్లోని ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, అంగన్‌వాడీ సెంటర్లలో శనివారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాజరు, సరుకుల రికార్డులు, పరిసరాలు, మధ్యాహ్న భోజనంలో నాణ్యత, తదితరాలను పరిశీలించారు. వైద్యులకు, హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు అందించారు. తనిఖీల్లో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, ప్రత్యేక అధికారి అనురాధ, తహసీల్దార్లు రాజ్‌కుమార్, వెంకటస్వామి, కిరణ్‌కుమార్, కృష్ణ, ఎంపీడీఓలు లెక్కల అరుంధతి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

నల్లబెల్లి : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ కోరారు. మండలంలోని మామిండ్లవీరయ్యపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. అర్హులకు ప్రభుత్వం బోనస్ జమ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జ్యోతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఏడాకుల సంపత్‌రెడ్డి, ఏపీఎం సునీత, మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి, వెన్నెల గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు యార ఈశ్వర, కార్యదర్శి పెండ్లి రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి అవుట్ పేషెంట్లకు క్లినికల్, ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. పట్టణంలో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పుట్ట రవి, విభాగాధిపతులు డాక్టర్ మనీశ్‌కుమార్, డాక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అగ్రగామిగా నిలపడమే ధ్యేయం



నర్సంపేట : పట్టణంలో బాణసంచా పేల్చుతున్న రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్

నర్సంపేట : ప్రపంచంలో భారత దేశాన్ని అగ్రగామిగా నిలపడమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలో ఆ పార్టీ గెలిచిన క్రమంలో పట్టణంలోని వరంగల్ రోడ్డు కూడలిలో శనివారం సంబురాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ పాలనపై వస్తున్న ప్రజాదరణకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం ఆంజనేయులు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భానోతు వీరన్న, జిల్లా కార్యదర్శి గుడిపూడి రాధాకృష్ణ, మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తడుక అశోక్ గౌడ్ మాట్లాడారు. మహారాష్ట్రలో పార్టీ గెలుపు వికసిత్ భారత్ ఆవిర్భవానికి మార్గం సుగమమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల కోటి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఈర్ల నాగరాజు, యువమోర్చా మండల అధ్యక్షుడు సుదగాని ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాది తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడారు. మహారాష్ట్ర ఫలితాలు ప్రధానిపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ప్రతీకగా అభివర్ణించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దూరి రాజ్‌కుమార్, నాంపెల్లి యాకయ్య, తాళ్లపెల్లి కృష్ణమూర్తి, కర్క సోమిరెడ్డి, దుర్గయ్య, అడప రాజు, బాబు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

వర్ధన్నపేట : వరంగల్ జెడ్పీ సీఈఓ రాంరెడ్డిని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై తొలిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, కోఆప్షన్ సభ్యుడు గాయాల సుమన్ ఆధ్వర్యంలో పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

భూదాతకు..

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రహదారి కోసం తన భూమి దానం చేసిన నాంపెల్లి మల్లేశంను తహసీల్దార్ విజయసాగర్ సన్మానించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. స్కూల్‌కు దారిలేక విద్యార్థులు ఇబ్బంది పడుతుండడంతో మల్లేశం స్పందించి అతడి తల్లిదండ్రులైన వెంకటమ్మ–వీరమల్లు జ్ఞాపకార్థం భూమిని దానం చేశారని చెప్పారు.

విద్యార్థుల ఉన్నతే లక్ష్యం

పర్వతగిరి : విద్యార్థులను కులమతాలకు అతీతంగా ఉన్నత స్థాయిలో నిలపడమే స్వేరో నెట్‌వర్క్ లక్ష్యమని జిల్లా నాయకులు గారె జయరాజ్, కందికట్ల ప్రవీణ్ తెలిపారు. మండలంలోని కొంకపాక హైస్కూల్‌లో స్వేరోస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రతిజ్ఞ దివస్ నిర్వహించారు. విద్యార్థులకు ఎంఈఓ లింగారెడ్డి, హెచ్‌ఎం భిక్షపతి చేతుల మీదుగా స్వేరో నాయకులు పరీక్ష సామగ్రి, స్కూల్ లైబ్రెరీకి పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్, ప్రవీణ్ మాట్లాడారు. పేదరికాన్ని జయించాలంటే చదువే మార్గమని చెప్పారు. అనంతరం ఎంఈఓ లింగారెడ్డి, హెచ్‌ఎం భిక్షపతి మాట్లాడారు. కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు భూక్యా ప్రవీణ్, భానోతు రమేశ్, ఎద్దు రాహుల్, డి.సంతోశ్, డి.సిద్దార్థ్ పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం సామాజిక బాధ్యత

- టౌన్ సీఐ రమణామూర్తి



వాహనదారులకు పూలు ఇస్తున్న విద్యార్థులు

నర్సంపేట రూరల్ : సమాజంలోని ప్రతిఒక్కరూ సురక్షితంగా ప్రయాణించేలా జాగ్రత్తలు తీసుకోవడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని నర్సంపేట టౌన్ సీఐ రమణామూర్తి కోరారు. సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించగా సీఐ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ వరంగల్ రోడ్డు జంక్షన్‌కు చేరుకోగా హెల్మెట్ లేని వాహనదారులకు విద్యార్థులు పూలు ఇచ్చి హెల్మెట్ ధరించాలని కోరారు. అనంతరం సీఐ మాట్లాడారు. వాహనదార్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల రహిత సమాజ నిర్మాణానికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై గూడ అరుణ్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : ఫ్రూట్స్ డే వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆహారంలో పండ్లు కీలకం

నర్సంపేట : ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పండ్లు కీలకమని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో వారంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఫ్రూట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ పండ్ల వేషధారణలో అలరించారు. పండ్ల ప్రాముఖ్యత, వాటిలో లభించే విటమిన్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుబ్బారావు మాట్లాడారు. పండ్లు తినడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పారు. అనారోగ్యం నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు రోజూ ఆహారంలో ఫ్రూట్స్ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జ్ రాధ, ఉపాధ్యాయులు శ్రీలత, చందన, యాస్మిన్, వీణ, పింకీ, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చితే తీవ్ర నష్టం

- ఏఈఓ కార్తీక్



రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ కార్తీక్

సంగెం : వరి కొయ్యలను కాల్చితే భూమికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఏఈఓ కార్తీక్ తెలిపారు. మండలంలోని బీకోజీనాయక్ తండాలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వరి పంట కోసిన తర్వాత ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ), 10–15 కిలోల యూరియా వరికొయ్యలపై చల్లాలని సూచించారు. తర్వాత నీటిని పెడితే కొయ్యలు కుళ్లిపోతాయని, తదనంతరం రోటావేటర్‌తో కలియ దున్నితే సల్ఫర్, భాస్వరం పోషకాలు విడుదలై మొక్కల ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. మట్టిలో జీవం పెరిగి ఉత్పాదకత మెరగవుతుందని వివరించారు. రసాయక ఎరువుల వాడకం, ఖర్చు తగ్గుతాయని చెప్పారు. అలాగే వాయి కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు బాలునాయక్, బాలాజీ, మత్రు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని శాయంపేట హవేలీలో తాళ్లపెల్లి లక్ష్మినారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేల సాయం అందజేశారు. ఆయన పంపిన నగదును ఆ పార్టీ నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, మాదాసి రాంబాబు, జూల రమేశ్, దాడి శివ, భిక్షపతి, పులి వెంకటేశ్, గాలి వీరయ్య, కాయిత అశోక్ బాధిత కుటుంబానికి అందజేశారు. అలాగే ఆరెపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్‌ను అతడి తండ్రి శంకర్‌రావు ఇటీవల మృతి చెందిన క్రమంలో బాలకిశోర్‌రెడ్డి సతీమణి స్వప్నదేవి పరామర్శించారు.

పరామర్శ

నర్సంపేట : బీఆర్‌ఎస్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గంప రాజేశ్వర్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రాజేశ్వర్‌గౌడ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, దేవోజు సదానందం, శివరాత్రి స్వామి పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు, తదితరులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని విజ్‌డమ్ స్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల విధులు నిర్వహించి అలరించారు. ప్రిన్సిపాల్‌గా మోక్షజ్ఞ, డీఈఓగా వర్ధన్, ఎంఈఓగా శశిత్ సాయి వ్యవహరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ స్థానిక శాఖ చైర్మన్ చిదురాల వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉత్తములుగా ఎదగడంలో చదువు ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దడమే కాకుండా నైపుణ్యాలు పెంపొందించే దిశగా ఏటా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్లు సుధాకర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు మెమోంటోలు అందజేసి అభినందించారు.

సింహగర్జన సభను విజయవంతం చేయాలి

నర్సంపేట : హైదరాబాద్‌లో డిసెంబర్ 1న తలపెట్టిన మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోకన్వీనర్ సాధు నర్సింగరావు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ కడారి కుమార్ కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో మాలల సింహగర్జన వాల్‌పోస్టర్లను శనివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ముఖ్య సలహాదారు మోటూరి రవి, జిల్లా సహాయ కార్యదర్శి అమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో మాలల సింహగర్జన కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి జిల్లా కన్వీనర్ కడారి కుమార్, మండల అధ్యక్షుడు మాడుగుల రాజు ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్‌లో డిసెంబర్ 1న మాలల సింహగర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిదురు తిరుపతి, దామెర సారంగపాణి, దామెర రజనీకాంత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.